ఆరోగ్య కేంద్రానికి
నిర్లక్ష్యపు జబ్బు
- నిధులు ఫుల్... మందులు నిల్
- వైద్య సేవలు అందక విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని వైవీయూ అధికారులు

7

వైఎస్ జగన్ లక్ష్యం విధ్వంసం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



కడప ఎర్రముక్కపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ విధ్వంసం సృష్టించాలన్నదే వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. తన పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది గాక నేడు తన ఉనికిని కాపాడుకోవడం కోసం అరాచకాన్ని కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. బుధవారం కడప నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 2019 నుంచి ఐదేళ్లపాటు వైఎస్ జగన్ రాష్ట్రాన్ని పాలించి అన్నింటా విఫలమయ్యారన్నారు. ఈ కారణంగానే గత ఎన్నికల్లో జనం కేవలం 11స్థానాలకు పరిమితం చేసినా ఆ పార్టీ నాయకులకు బుద్ధి రాలేదన్నారు. నేడు ఆయన బంగారుపాళెం వెళ్లింది రైతుల కోసం కాదని, కేవలం విధ్వంసం సృష్టించాలన్న ఉద్దేశంతో పర్యటించారన్నారు. ఆయన హయాంలో మామిడి రైతులను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. మామిడి కిలోకు రూ.4 అదనంగా చెల్లించి కొనుగోలు చేసేలా ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే ఆయన ప్రజలను రెచ్చగొడుతున్నారని అన్నారు. నెల్లూరులో మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మహిళల వ్యక్తిగత జీవితాలను గురించి మాట్లాడిన అంశాలను ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా పెట్టుబడులు వస్తున్న తరుణంలో వైసీపీ నేతల తీరు ఆందోళన కలిగిస్తోందన్నారు. వైఎస్ జగన్ హయాంలో ఏర్పాటైన ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ గురించి వైసీపీ నేతలు మాట్లడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్యార్థులకు తగిన న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు.

ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో
డైరెక్ట్ అడ్మిషన్లకు అనుమతి

కడప ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి 2025-26 విద్యాసంవత్సరానికి బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (బీడీఈఎస్), బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ) కోర్సుల్లో మెరిట్ ఆధారంగా నేరుగా అడ్మిషన్లు ఇచ్చే అధికారం ఇచ్చింది. ఏపీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి ఆదేశాల మేరకు బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విభాగాలైన పెయింటింగ్, ఫొటోగ్రఫీ, ఆనిమేషన్, స్కల్ప్చర్, అప్లైడ్ ఆర్ట్స్, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో సీట్లు నేరుగా అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయవచ్చు. 2025-26 విద్యా సంవత్సరానికి అర్హత పొందిన అభ్యర్థులను సంబంధిత కోర్సుల్లో మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఈ ప్రక్రియను అమలు చేస్తారు.

అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2025కు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో షంషుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హత/ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు ఈనెల 13వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సర్వం సిద్ధం

- నేడు మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్



పాఠశాలలో ఏర్పాటుచేసిన ఫొటో ఫ్రేమ్‌లో ఫోటోలు తీయించుకుంటున్న విద్యార్థులు, పేరెంట్స్

- పాఠశాలలు, జూనియర్ కళాశాలలు 2,973
- విద్యార్థులు 3,30,581 మంది
- పిల్లల సమగ్ర ప్రగతిని వివరించనున్న ఉపాధ్యాయులు



కడప ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు చర్యలు తీసుకుంటూనే.. మరోవైపు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సంబంధాలను మరింత బలపరచడానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించడానికి నిర్ణయించింది. జిల్లాలోని 2,973 పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోను అత్యంత ప్రతిష్టాత్మకంగా జరపడానికి పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి 3,30,581 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు హాజరుకానున్నారు. ఇందుకోసం ఆయా పాఠశాలల కాంపోజిట్ గ్రాంట్ల నుంచి 20శాతం నిధులను వెచ్చించాలని ఆదేశించింది. పది మంది పిల్లలున్న బడులకు వెయ్యి రూపాయలు, 300 నుంచి 400 మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ.5వేలు.. ఇలా పిల్లల సంఖ్యను బట్టి నిధులను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. వారం రోజుల ముందే ఉత్తర్వులు వెలువడడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు జోరందుకున్నాయి.

తల్లిదండ్రుల సమావేశాలు కొత్త కానప్పటికి, ఈసారి పలు ప్రత్యేకతలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పూర్వ విద్యార్థులు, దాతలు, ఉపాధ్యాయులు, ఎవరిస్థాయిలో వారు నిధులు సేకరించి కార్యక్రమం విజయవంతం చేసే ప్రణాళికతో ఉన్నారు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఈ మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ నిర్వహణకు కమిటీలను కూడా ఏర్పాటుచేశారు. ఆహ్వాన కమిటీ, బడ్జెట్ కమిటీ, బడి సుందరీకరణ కమిటీ, పర్యావరణ పరిరక్షణ, రిసెప్షన్, సీటింగ్, విద్యార్థుల ప్రగతి నివేదికల తయారీ, స్టేజీ నిర్వహణ వంటి పనులకు వేర్వేరు కమిటీలను ఏర్పాటుచేశారు.

పిల్లల ప్రగతిపై సమగ్ర నివేదికలు

ప్రత్యేకంగా నిర్వహించే ఈ సమావేశంలో పిల్లల ప్రగతికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికల్ని తల్లిదండ్రులకు అందజేయ నున్నారు. సమగ్రశిక్ష అధికారులు తయారు చేస్తున్న ఈ నివేదికల్లో అకడమిక్ వివరాలతో పాటు హాజరు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కనబరచిన ప్రతిభ, ఇతర రంగాలలో పురోగతి, ఆరోగ్య సమాచారం, ఎత్తు, బరువు తదితర వివరాలను కూడా పొందుపరచనున్నారు.



పిల్లలు, పెద్దలకు వేర్వేరుగా ఆటల పోటీలు

ఈ మెగా మీట్‌లో భాగంగా పిల్లలకు, వారి తల్లిదండ్రులకు వేర్వేరుగా పలు క్రీడల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నారు. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు అధికంగా వినియోగించే పిల్లల పట్ల వ్యవహరించాల్సిన తీరుపై పెద్దలకు అవగాహన కల్పించనున్నారు. పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులను కూడా ఆహ్వానించి కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా కుటుంబం ఫొటో, డ్రీమ్ వాల్స్, పాజిటివ్ పేరెంటింగ్ సెషన్లు, అమ్మ పేరుతో మొక్కనాటడం, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సందేశాలు, పిల్లల పురోగతిపై ఇంటరాక్టివ్ సెషన్లు జరగనున్నాయి.

విద్యాలయాలు, విద్యార్థుల వివరాలు..	
పాఠశాలలు	
ప్రభుత్వ పాఠశాలలు	2,042
ప్రైవేట్ పాఠశాలలు	771
మదరసాలు	5
మొత్తం పాఠశాలలు	**2,818**
విద్యార్థుల సంఖ్య	**2,93,581**
జూనియర్ కళాశాలలు	
ప్రభుత్వ	20
ఎయిడెడ్	5
కేజీబీవీ	17
సాంఘిక సంక్షేమం	13
హైస్కూల్ ప్లస్	14
ప్రైవేట్	86
మొత్తం కళాశాలలు	**155**
ఇంటర్మీడియట్ విద్యార్థుల సంఖ్య	**37,000**

ఢిల్లీ సదస్సులో కలెక్టర్



కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

కడప కలెక్టరేట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో మంగళ, బుధవారం రెండు రోజుల పాటు జరిగిన నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ వర్క్ షాపు సదస్సుకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర గనులు, పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలిశారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ కార్యకలాపాలు, జిల్లాలోని అభివృద్ధి పనులను గురించి వివరించారు. అలాగే గండికోట ప్రాజెక్ట్‌లో జరుగుతున్న పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధి గురించి కేంద్ర మంత్రికి కలెక్టర్ తెలియజేశారు. బుధవారం జిల్లా ఖనిజ క్షేత్ర నిధి సంస్థల నిర్వహణకై ప్రణాళిక అనే అంశంపై కలెక్టర్ ఇచ్చిన ప్రజెంటేషన్‌కు మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా భారత బొగ్గు మరియు గనుల మంత్రిత్వ శాఖ వారు కలెక్టర్‌ను జ్ఞాపికతో సత్కరించారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి
రూ.350 కోట్లతో ప్రతిపాదనలు

ప్రొద్దుటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో మురుగునీటి వ్యవస్థను ఆధునీకరించే లక్ష్యంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూ.350 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రాజెక్టు రిపోర్టు తయారు చేశారు. దీనికి సంబంధించి గతంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో యూజీడీ, స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ స్కీంలకు సంబంధించి విజయవాడకు చెందిన ఇనాస్ ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్ కన్సల్టెంట్ మేనేజింగ్ పార్టనర్ డి.రాజశేఖర్‌తో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి సమీక్షించారు. రూ.350 కోట్ల అంచనాతో రూపొందించిన రిపోర్టుపై మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఈఈ ఎం శ్రీనివాసులు, డీఈలు రాజేశ్, ఈశ్వర్‌రెడ్డితో పాటు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగరాజు, టీపీవో చంద్రమోహన్ తదితర అధికారులతో సమీక్షించారు. ప్రొద్దుటూరు పట్టణానికి యూడీజీ సాధ్యమా కాదా అని చర్చించారు. అలాగే ఆగిపోయిన కూరగాయల మార్కెట్ నిర్మాణానికి గుడ్‌విల్ యాక్షన్ ద్వారా నిధుల సమీకరణకు ప్రయత్నాలు ప్రారంభించాలని తీర్మానించారు.

కుందూకు భారీగా వరదనీరు



కుందూలో ప్రవహిస్తున్న వరదనీరు

రాజుపాలెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శ్రీశైలం రిజర్వాయరు నిండి అక్కడి నుంచి వస్తున్న బ్యాక్‌వాటర్ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు ద్వారా కుందూనదిలోకి భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. బుధవారం కేసీ కెనాల్ మైదుకూరు సబ్ డివిజను డీఈ చిన్నపుల్లయ్య, ఏఈ జమాల్‌వలి జిల్లా సరిహద్దులోని రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదికి వస్తున్న వరదనీటిని పరిశీలించారు. సాయంత్రం కుందూలోకి 3,200 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందని డీఈ తెలిపారు. కుందూలో నీరు ప్రవహిస్తుండటంతో పరివాహక ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేసీ కెనాల్ కింద సాగైన పసుపు, మిరప, మొక్కజొన్న తదితర పంటలకు తడులు అందించేందుకు అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు. నెలరోజులుగా వర్షాలు లేకపోవడంతో బోర్ల ద్వారా అందిస్తున్న నీరు సరిపడక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ వరదనీరు ఉపశమనం ఇస్తుంది.

గోడౌన్‌లో సరుకు బయటకు పోనివ్వం
- గేటుకు తాళం వేసి లారీలను అడ్డుకున్న రైతులు
- భూపేశ్‌రెడ్డి హామీతో పొగాకు పంట తరలింపు

7

తెలుగు తమ్ముళ్ల
బాహాబాహీ 6
- మట్టి తరలింపులో విభేదాలు

కె.బొమ్మేపల్లె డీకేటీ భూములపై
విచారణ 7

మెనూ ప్రకారం
భోజనం
ఎందుకు పెట్టడం లేదు
- గురుకుల పాఠశాల సిబ్బందిపై డీఎల్‌డీవో ఆగ్రహం

6

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం

- కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తాం
- కదం తొక్కిన కార్మికులు



సార్వత్రిక సమ్మె సందర్భంగా కడపలో నిర్వహించిన కార్మిక సంఘాల ర్యాలీ

కడప సెవెన్ రోడ్స్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలను, ఉద్యోగులు, కార్మికుల హక్కులను కాపాడుకుందామని ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం విద్యుత్ భవన్ ఎదుట జేఏసీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు బండి రామలింగారెడ్డి, బర్నబాస్, చలపతి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ మన శ్రమ, మన కష్టం, మన త్యాగాలే ఈ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక కానీ మన కష్టానికి తగిన గౌరవం, సమాన వేతనం, సురక్షిత పనివాతావరణం లభిస్తున్నాయా అని ప్రశ్నించారు. నాలుగు లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ఈ చట్టాలు రద్దుకావాలని డిమాండ్ చేశారు. ప్రభ్వు సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. తద్వారా లక్షలాది ఉద్యోగాలు ఊడుతున్నాయన్నారు. 8గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచారన్నారు. ఇది కార్మికులపై అదనపు భారం మోపడమే అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునరెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తాం

కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తామని ఐక్య కార్మిక రైతు వ్యవసాయ సంఘాలు నినదించాయి. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఐక్య కార్మిక, రైతు వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో కడపలో కార్మికులు కదం తొక్కారు. స్థానిక సీఎస్ఐ చర్చి నుంచి పెద్దఎత్తున ర్యాలీ ప్రారంభమై సెవెన్ రోడ్స్ దగ్గర సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి బి.మనోహర్, ఏఐటీయూసీ, యూటీయూసీ, టీయూసీసీ, ఏఐసీటీయూ, ఐఎఫ్‌టీయూ, టీయూసీ, యూటీఎఫ్ నేతలు మాట్లాడారు. లేబర్‌కోడ్‌లు అమలు చేస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన కూడా తెలియజేసే అవకాశం కోల్పోతారన్నారు. వీటిని అందరూ వ్యతిరేకించాలన్నారు. ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. సమ్మెకు సంఘీభావంగా పర్యాటక శాఖ రిటైర్డ్ డైరెక్టర్ జి.గోపాల్, ఎల్‌ఐసీ పింఛనర్స్ అసోసియేషన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సుధీకర్, క్లాస్ 1 ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, సలాం లియాఫీ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరా, ఏపీజీబీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసన్నకుమార్, ఏపీజీబీ ఆఫీసర్ పింఛనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు.

గరుడుడిపై గోవిందుడు...

- వేడుకగా సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు



ఉదయం మాడవీధుల్లో శేషవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న సౌమ్యనాథుడు



గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న సౌమ్యనాథుడు

నందలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సౌమ్యనాథ స్వామి మహావిష్ణువు అలంకారంలో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో గరుడ వాహనంపె సౌమ్యనాథుడు ఆలయ ప్రాకారంలో ప్రదర్శనగా వెళ్లి అనంతరం దిగువ వీధి, పేటగడ్డ, బస్టాండు మీదుగా అరవపల్లె వరకు గ్రామోత్సవం కొనసాగింది. అనంతరం అరవపల్లెలోని రైల్వేకాలనీలో మరికొన్ని వీధుల్లో గ్రామోత్సవంగా వెళ్లి నందలూరు బ్రాహ్మణవీధికి చేరుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రత్యేకమైన గరుడ సేవను తిలకించేందుకు విశేష సంఖ్యలో భక్తులు వచ్చారు. ఉదయం పుష్పాలంకరణ ప్రియుడైన సౌమ్యనాథ స్వామి మోహిని అలంకారంలో శేషవాహనంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు గురువారం ఉదయం సౌమ్యనాథస్వామి ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డుకు మోక్షం!

- కదులుతున్న ఫైలు
- ప్రభుత్వానికి నివేదిక అందించిన అధికారులు
- అటవీశాఖ అనుమతి, రోడ్డు కనెక్టివిటీ కోసం ఫైల్ సిద్ధం



గతంలో ఎస్ఆర్ కాలనీ వరకు వేసిన రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు



అడవి మధ్యలో ఎరుపు రంగులో కనిపిస్తున్నదే రోడ్డు మార్గం

రైల్వేకోడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డుకు కూటమి ప్రభుత్వంలో మోక్షం వచ్చింది. ఆర్అండ్‌బీ అధికారులు నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించారు. అటవీశాఖ అనుమతి, రోడ్డు కనెక్టివిటీ తదితర వాటి కోసం అధికారులు ఫైలు సిద్ధం చేశారు. భూసేకరణ కోసం అయ్యే ఖర్చు కూడా లెక్కలు వేశారు. 35 హెక్టార్ల వరకు భూసేకరణ చేయాల్సి వస్తుందని అంచనాలు వేశారు. రోడ్డు నిర్మాణాలు, కల్వర్టులు, బ్రిడ్జిలు, టర్నింగ్ పాయింట్లు తదితర వాటి కోసం ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే నివేదికలు తయారు చేస్తామని ఆర్అండ్‌బీ శాఖాధికారులు చెబుతున్నారు. 30 ఏళ్లుగా రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు పెండింగ్‌లో ఉంది. ఇందుకు సంబంధించిన ఫైలు బుట్టదాఖలైంది. గత కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వంలో రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు మంజూరు చేస్తామని హామీలు ఇచ్చిన పాలకులు తర్వాత దాని గురించే మరిచిపోయారు. గత ఏడాది ఎన్నికల సమయంలో కూటమి నాయకులు రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డును మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే రోడ్డు విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల దృష్టికి కోడూరు ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్, కుడా చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డిలు స్వయంగా కలసి విన్నవించారు. దీంతో మూడు నెలల క్రితం ఎమ్మెల్యే తో పాటు ఆర్అండ్‌బీ అధికారులు రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డును పరిశీలించారు. తర్వాత ఆర్అండ్‌బీ శాఖాధికారులు ఇందుకు సంబంధించిన ఫైలును సిద్ధం చేసి నివేదికను ప్రభుత్వానికి పంపారు. రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డుకు సంబంధించిన భూసర్వే చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా 30 ఏళ్ల క్రిందట రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు ప్రతిపాదనలు చేసి రైల్వేకోడూరు మార్కెట్ యార్డు నుంచి కేఆర్ కండ్రిక గ్రామం పరిధిలోని ఎస్ఆర్ కాలనీ వరకు 8.9 కిలోమీటర్ల దూరం వరకు తారు రోడ్డు నిర్మించారు. అటువైపు వెంకటగిరి నుంచి లాలాపేట అటవీ సరిహద్దు వరకు 6.3 కిలోమీటర్ల దూరం వరకు తారు రోడ్డు నిర్మాణం చేశారు. మధ్యలో అడవి ఉండడంతో అటవీశాఖ అనుమతులు అప్పట్లో రాకపోవడంతో ఈ రోడ్డు పెండింగ్‌లో పడి పోయింది. అప్పటి నుంచి పాలకులు ఈ రోడ్డుకు అటవీశాఖ అనుమతులు తెచ్చుకోకపోవడంతో ఈ ఫైలు మరుగున పడిపోయింది. కూటమి ప్రభుత్వం రాగానే ఈ రోడ్డు ఫైలుకు కదలిక వచ్చింది. ఎమ్మెల్యేతో పాటు పార్టీ ఇన్‌చార్జ్ ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎంలతో కలిసి ఈ రోడ్డు విషయమై చర్చించారు. దీంతో వారి నుంచి సానుకూలమైన స్పందన రావడం, ఫైలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడం ద్వారా కదలిక వచ్చింది. ఈ రోడ్డు ప్రారంభమైతే రైల్వేకోడూరు నుంచి వెంకటగిరికి 41 కిలోమీటర్లే. గంటలో వెంకటగిరి చేరుకోవచ్చు. ఇటు వ్యాపారం, అటు మానవ సంబంధాలు పెరుగుతాయి. అదే రైల్వేకోడూరు, రేణిగుంట, ఏర్పేడు మీదుగా వెంకటగిరికి వెళ్లాలంటే 83 కిలోమీటర్ల దూరం వస్తుంది. అదేవిధంగా రైల్వేకోడూరు, చిట్వేలి, రాపూరు మీదుగా వెంకటగిరికి వెళ్లాలంటే 85 కిలోమీటర్ల దూరం వస్తుంది. అందులోను ప్రయాణ గంటలు పెరగడమే కాకుండా వ్యయప్రయాసలు పెరుగుతాయి. రైల్వేకోడూరు నుంచి కొండల మధ్య నుంచి వెళితే ప్రయాణ గంటలు తగ్గడమే కాకుండా వెంకటగిరి నుంచి నెల్లూరు తదితర ప్రాంతాలకు సులువుగా వెళ్లేందుకు బాగుంటుంది. విజయవాడకు ప్రయాణించే వారు రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు మీదుగా వెళితే దూరం తగ్గనుంది. వెంకటగిరిలో చీరలు, అరటి కాయలు, బొప్పాయి, మామిడి వ్యాపారం చేసుకునేందుకు వ్యాపారులకు అనువుగా ఉంటుంది. త్వరలోనే రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు భూసర్వే కోసం అనుమతి వస్తుందని, సర్వే పూర్తి కాగానే అటవీశాఖ అనుమతి, తర్వాత బ్రిడ్జిలు, కల్వర్టులు, మెటల్ వర్క్, తారు రోడ్డు తదితర వాటిపై అధికారులు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపితే ప్రభుత్వం నిర్మాణ వ్యయ అంచనాలు వేసి నిధులు మంజూరు చేస్తుంది. ఆ తర్వాత టెండర్లు పిలిచి పనులు ప్రారంభమవుతాయని రైల్వేకోడూరు ఆర్అండ్‌బీ శాఖ డీఈ జయప్రసాద్ వివరించారు.



రోడ్డు తనిఖీ చేసి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్ (ఫైల్)

ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి తగ్గించవచ్చు



రైతులకు అవగాహన కల్పిస్తున్న బోదేషావలి

పీలేరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు పెట్టుబడి గణనీయంగా తగ్గించవచ్చని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు, డీవీఎంసీ సభ్యుడు బోదేషావలి తెలిపారు. కౌన్సిల్ ఫర్ రూరల్ ఎన్‌లైట్మెంట్ (సీఆర్ఈ) సంస్థ, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ (ఏపీఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో కేవీపల్లె మండలం మంచాలమంద గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఇచ్చిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో అధిక పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని, దిగుబడి తగ్గుతుందన్నది కేవలం అపోహ మాత్రమేనన్నారు. రసాయనిక ఎరువుల స్థానంలో జీవన ఎరువులు, క్రిమిసంహారక మందులకు బదులు వేప నూనె కషాయాలను వాడి ఖర్చు తగ్గించుకోవడమే కాకుండా ఆరోగ్యకరమైన పంటలను పండించగలమన్నారు. సీఆర్ఈ సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ మంచాలమంద, వడ్లకుంట గ్రామాల్లోని రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించి వారి ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు దిగుబడి చేయిస్తామన్నారు. కేవీపల్లె ఏఓ మాధవి మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. సీఆర్ఈ సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రహల్లాద మాట్లాడుతూ ఏపీఎఫ్ ద్వారా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, అందులోని నియమ నిబంధనలను రైతులకు తెలియజేశారు.

లక్కిరెడ్డిపల్లెలో చోరీ



చిందరవందరగా పడేసిన వస్తువులు

లక్కిరెడ్డిపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులందరూ పొలం పనులకు వెళ్లిన సమయంలో దొంగలు తలుపులకు వేసిన తాళం పగులగొట్టి నగలు, నగదు అపహరించుకు వెళ్లారు. బాధితుల కథనం మేరకు మోటారుకు మరమ్మతులు చేస్తుండడంతో మండలంలోని కోనంపేటకు చెందిన కొర్లకుంట రామచంద్రయ్య కుటుంబ సభ్యులందరూ బుధవారం తలుపులకు తాళం వేసి పొలం వద్దకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు గడ్డపారతో తాళం పగలగొట్టి లోపలికి వెళ్లి బీరువాలో దాచిన లక్ష రూపాయలు నగదు, బంగారు నగలు అపహరించికుపోయినట్లు బాధితుడు తెలిపారు. ఎస్ఐ రవీంద్రబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది

- జిల్లా విద్యాశిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్



విజేతలతో డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు, అధ్యాపకులు

రాయచోటిటౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచి విద్యార్థులు ఇతరులతో పోటీపడి చదివినప్పుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని డైట్ ప్రిన్సిపాల్ ఎంఆర్ఎస్ అజయ్‌కుమార్‌బాబు అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని డైట్‌లో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై పెయింటింగ్, లింగ సమానత్వంపై వ్యాసరచనలో విద్యార్థులకు ఉమ్మడి కడప జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తు నాశనం అవుతుందని, వాటి నివారణకు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లింగ సమానత్వం అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని, ఇది అభివృద్ధి చెందుతున్న సమాజానికి పునాది వంటిదన్నారు. లింగ సమానత్వం ద్వారానే సామాజిక పురోగతి సాధ్యమవుతుందన్నారు.

జిల్లా స్థాయి విజేతలు వీరే

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కడప జిల్లాలోని క్లస్టర్ కాంప్లెక్స్ స్థాయిలో విజేతలైన విద్యార్థులకు జిల్లా స్థాయిలో బుధవారం డైట్‌లో పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో రాజంపేట మండలం బోయినపల్లి ఎస్‌జేఎస్‌యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పి.మల్లేశ్వరి ప్రథమ స్థానం, అదే పాఠశాలకు చెందిన కె.సుప్రియ ద్వితీయ స్థానం, ఓబులవారిపల్లె మండలం సంజీవపురం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాల విద్యార్థి పి.సూర్య తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే లింగ సమానత్వంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టి.సుండుపల్లె విద్యార్థిని ఎస్.మదిహా ప్రథమ స్థానం, రాజంపేట గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థిని జె.రాధిక ద్వితీయ స్థానం, అదే పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్.తహనీ తృతీయ స్థానం సాధించారు. అలాగే సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మౌనిక, రాయచోటి మోడల్ స్కూల్ విద్యార్థి ఉదయ్‌కిరణ్‌లు ప్రోత్సాహక బహుమతులు కైవసం చేసుకున్నారు. పెయింటింగ్, వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రిన్సిపాల్ తన చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను, పతకాలను, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, లెక్చరర్స్ శివభాస్కర్, వైసీ రెడ్డెప్పరెడ్డి, తిరుపతి శ్రీనివాసులు, మోహన్‌నాయక్, కేదార్నాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

'కష్టపడి చదవండి'



అన్నాన్ని పరిశీలిస్తున్న సురేశ్‌కుమార్

సుండుపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అన్ని సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థులు కష్టపడి చదవాలని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి, సుండుపల్లె మండల ప్రత్యేక అధికారి సురేశ్ కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రానికి సమీపంలోని పుల్లారెడ్డిగారిపల్లె గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిని పరిశీలించారు. అన్నం, కూరలు నాణ్యతగా చేసి విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం పాఠశాలలోని స్టోర్‌రూమ్, డార్మిటరీ, టాయిలెట్స్, గార్డెన్, తరగతి గదులను పరిశీలించారు. రాత్రిపూట గదుల నుంచి బయటికి రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కష్టపడి మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కాంపౌండ్ వాల్ లేకపోవడం వలన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం ఎందుకు పెట్టడం లేదు

గురుకుల పాఠశాల సిబ్బందిపై డీఎల్‌డీవో ఆగ్రహం

తంబళ్లపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఎందుకు పెట్టడం లేదని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో అమర్నాథరెడ్డి ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల అధికారులతో కలసి ఆయన ఎస్టీ బాలుర గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఏడాదికేడాది విద్యార్థుల సంఖ్య తగ్గుతుండడంపై సిబ్బందిని ప్రశ్నించారు. భోజనం నాణ్యతగా పెడుతున్నారా.? మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా.? అని విద్యార్థులను అడగ్గా భోజనం నాణ్యతగా పెట్టడం లేదని ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రంగనాయకులు అక్కడ లేకపోవడంతో ఫోన్ చేసి పిల్లలకు ఎందుకు భోజనం సరిగ్గా పెట్టడం లేదని ప్రశ్నించారు. వెంటనే వంట గది, స్టోరు రూమును తనిఖీ చేయగా పలు విషయాలు వెలుగుచూశాయి. కొన్ని నెలలుగా పాఠశాలలో ఉన్న రెండు ఆర్వో వాటర్ ప్లాంట్లు పనిచేయడం లేదని, రెండు రోజుల నుంచి సన్నబియ్యంతో కాకుండా, లావు బియ్యంతో భోజనం వండుతున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా కొద్దిరోజుల నుంచి కోడిగుడ్లు, చిక్కి, పాలు, పెరుగు ఇవ్వడం లేదని మొత్తం పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టలేదనే విషయాన్ని తెలుసుకున్నారు. వంట నిర్వాహకులను ప్రశ్నించగా ప్రిన్సిపాల్ రెండు రోజుల కిందటి నుంచే లావు బియ్యంతోనే వండమన్నారని వారు సమాధానమిచ్చారు. ఇక నుంచి విద్యార్థులకు మెనూ మేరకు సన్నబియ్యంతో వండిన నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. నిత్యం అధికారులు పాఠశాలను పర్యవేక్షిస్తూ తనిఖీ చేపట్టాలని ఎంఈవోను ఆదేశించారు. అంతకు ముందు ఆయన ప్రభుత్వాస్పత్రిలో సదరం క్యాంపును పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో థామస్‌రాజు, ఎంఈఓ త్యాగరాజు, ఏపీఓ అంజనప్ప, మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు



కలెక్టర్ శ్రీధర్‌కు దేవుడి ప్రతిమను అందచేస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

రాయచోటి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను బుధవారం రాయచోటిలోని కలెక్టర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమస్యల గురించి కలెక్టర్‌తో చర్చించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, రాయచోటి తహసీల్దార్, ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షుడు నరసింహకుమార్, జీవన్ చంద్రశేఖర్, జిల్లాలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

అనంతరం బొప్పరాజు వెంకటేశ్వర్లు ఉమ్మడి కడప జిల్లాలోని తహసీల్దార్లతో రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలను ఏ విధంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి, తదితర అంశాలపై చర్చించారు.

సింహ వాహనంలో సిద్ధేశ్వరస్వామి

రాజంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాక చెన్నకేశవ, సిద్ధేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సిద్ధేశర్వస్వామి సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వేర్వేరు ఘటనలపై కేసు నమోదు

పెనగలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వేర్వేరు చోట్ల మంగళవారం రాత్రి జరిగిన సంఘటనలపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు పెనగలూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. రాజంపేట పట్టణంలో స్థిరపడిన శివశంకర్‌రెడ్డి, ఆయన కుమారుడు వర్షిత్‌రెడ్డి మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో నెల్లూరు నుంచి రాజంపేటకు వెళుతుండగా వారు ప్రయాణిస్తున్న కారు జగ్గంపేటలో స్కూటీపై వెళుతున్నవారిని ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. మరికొంత దూరం వెళ్లిన తర్వాత ఆటోను ఢీకొనడంతో నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయని ఆయన తెలిపారు. మనుషులు ప్రయాణిస్తున్న రెండు వాహనాలను ఢీకొని ఆపకుండా వెళుతుండడంతో స్థానికులు పెనగలూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు బెస్తపల్లె చెక్‌పోస్టు వద్ద రోడ్డుకు లారీని అడ్డంగా ఆపి కారులో ప్రయాణిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం మైకంలో ఉన్న నిందితులు స్టేషన్‌కు వచ్చేంతవరకు రభస చేశారని అన్నారు. స్టేషన్‌లో ప్రవేశించిన తర్వాత వర్షిత్‌రెడ్డి స్టేషన్‌లోని ఫర్నిచర్‌ను, లాప్‌టాప్‌ను ధ్వంసం చేశాడని, స్టేషన్ రైటర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

- మట్టి తరలింపులో విభేదాలు

ఒంటిమిట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్‌శాఖ అధికారుల అనుమతితో ఒంటిమిట్ట చెరువులోని మట్టిని కొద్ది రోజులుగా తరలిస్తున్నారు. బుధవారం వారు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణపడ్డారు. సీఐ బాబు తెలిపిన వివరాల మేరకు... చెరువులోని మట్టిని తరలించుకునే అనుమతుల కోసం బుధవారం ఉదయం కడపలోని ఈఈ కార్యాలయానికి రెండు వర్గాల వారు వెళ్లారు. అక్కడే వాగ్వాదానికి దిగారు. అనంతరం ఒక వర్గంవారు ఒంటిమిట్ట హరిత హోటల్‌లో ఉండగా మరో వర్గం వారు దాడికి ప్రయత్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. హరిత హోటల్ అధికారి సమాచారం అందించడంతో వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాల వారిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ బాబు మాట్లాడుతూ ఇరువర్గాలకు చెందిన 14 మందిపై కేసు నమోదు చేసి రెండు వాహనాలు సీజ్ చేశామని తెలిపారు.

చదువు కొనసాగించడానికి చక్కటి అవకాశం ఓపెన్ స్కూల్

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, తదితరులు

రాయచోటి టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మధ్యలో బడి మానేసిన విద్యార్థులకు తిరిగి చదువు కొనసాగించడానికి ఓపెన్ స్కూల్ ఒక చక్కటి అవకాశమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు సంబంధించి సార్వత్రిక విద్యాపీఠం ప్రచార పోస్టర్లను, కరపత్రాలను బుధవారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి ఫెయిల్ అయిన వారు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి పరీక్ష రాసే ఒక చక్కటి అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని, 10 ఉత్తీర్ణులైన వారు అతి తక్కువ ఫీజుతో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొంది ఆగిపోయిన చదువులను కొనసాగించుకోవచ్చని తెలిపారు. చదువుకోని వారితో పాటు, చదువు మధ్యలో మానేసిన వారికి విద్యను అందించే సార్వత్రిక విద్యాపీఠంలో ప్రవేశాల సంఖ్యను పెంచాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరిన వారికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, తదితరాలు అభ్యాసకుల ఇంటికి నేరుగా పంపిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం తెలియజేశారు. ఇంటర్నెట్ ఏపీ ఆన్‌లైన్, సమీపంలోని ప్రభుత్వ అనుబంధ విభాగాల ఉన్నత పాఠశాలలు, సచివాలయాల ద్వారా ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈనెల 30వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ప్రవేశాలు పొందవచ్చునని జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరాజు తెలియజేశారు. కార్యక్రమంలో అబ్బవరం మధుసూదన్, వీరబల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఏఐతో వైద్య సేవలు సులభం

మదనపల్లె టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్యరంగంలో సేవలు సులభంగా సాగుతున్నాయని ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ శిల్ప అన్నారు. బుధవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ఏఐసీటీ ఆధ్వర్యంలో అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సదస్సు మూడో రోజున ఆమె మాట్లాడుతూ ఏఐ సామర్థ్యంతో మనిషిలో దాగి వున్న రోగాన్ని ఖచ్చితత్వంతో గుర్తించవచ్చన్నారు. దీని వలన సమయం, ఖర్చు వృథా కాదన్నారు. బయో ఇన్ఫర్మేటిక్స్ నిపుణురాలు షరన్ అలెగ్జాండర్ మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు వున్న వారికి ఏఐ ద్వారా అతి త్వరగా చికిత్స అందించి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, కోఆర్డినేటర్ కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డులో అన్నా క్యాంటీన్



భూమి పూజ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): టమోటా రైతులు యార్డు నుంచి ఖాళీ కడుపుతో ఇంటికి వెళ్లకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్కెట్ యార్డులో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన ఆయన మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద టమోటా మార్కెట్‌గా పేరొందిన ములకలచెరువు మార్కెట్‌కు టమోటాలు తీసుకొచ్చే రైతులు కడుపు నిండా బోజనం తిని ఇంటికి వెళ్లాలనే లక్ష్యంతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అతి త్వరలోనే భవనాన్ని నిర్మించి అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామన్నారు. బి.కొత్తకోటలో కూడా అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, ఎంపీడీవో హరినారాయణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, యర్రగుడి సురేష్, కేవీ రమణ తదితర నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ'



ఏటీఎం మోడల్ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఓబులవారిపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఉన్నా జాబితాలో పేర్లు లేని రైతులు రైతుసేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఆన్‌లైన్‌లో వివరాలు సరిదిద్దుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ సూచించారు. బుధవారం చిన్నఓరంపాడులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నోటిఫై చేయబడిన అరటి పంటకు వాతావరణ ఆధారిత బీమా చేసుకునేందుకు ఈనెల 15 ఆఖరు అన్నారు. నెట్‌సెంటర్ల ద్వారా ఎకరాకు 3,062 రూపాయల చొప్పున ప్రీమియం చెల్లిస్తే 60,400 రూపాయలు బీమా లభిస్తుందని తెలిపారు.

కిసాన్ దీదీ డ్రోన్ పథకంలో 80 శాతం రాయితీతో మండలానికి ఒక యూనిట్ పొందేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీసీఎన్ఎఫ్ ద్వారా అమలవుతున్న ఏటీఎం మోడల్‌ను సందర్శించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని ప్రోత్సహించారు. అనంతరం ముక్కావారిపల్లె రైతుసేవా కేంద్రాన్ని సందర్శించి అన్నదాత సుఖీభవ జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో కోడూరు ఏడీఏ మణిసుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారి మల్లిక, టెక్నికల్ ఏఓలు రమేష్‌రాజు, శ్రీరాములు రైతుసేవా కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, బుల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

వేలంతో రూ.96,500 ఆదాయం

చిన్నమండెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించి ఐదు గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న భూములను మూడేళ్ల పాటు సాగు చేసుకునే హక్కులను బుధవారం 11 గంటలకు వేలం వేసినట్లు ఈవో కొండారెడ్డి తెలిపారు. ఒక్కో సంవత్సరానికి 96,500 రూపాయలు చెల్లించేలా వేలంలో పాల్గొన్న వారు హక్కు పొందారన్నారు.

ఆరోగ్య కేంద్రానికి నిర్లక్ష్యపు జబ్బు

- నిధులు ఫుల్... మందులు నిల్
- వైద్య సేవలు అందక విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని వైవీయూ అధికారులు



వైవీయూలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కడప ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఆరోగ్య కేంద్రాన్ని నిర్లక్ష్యపు జబ్బు పట్టిపీడిస్తోంది. సమృద్ధిగా నిధులున్నా మందులు లేక విద్యార్థులు అల్లాడుతున్నారు. తేలికపాటి జ్వరం వచ్చినా మందులు లేక 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న రిమ్స్ హాస్పిటల్‌కు అంబులెన్స్‌లో వెళ్లాల్సిన దుస్థితి. దీంతో సరైన వైద్యం అందక విద్యార్థులు పడుతున్నారు. దీనిపై వైవీయూ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

యోగివేమన విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, పరిశోధన స్కాలర్లు, ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబాలకు 24 గంటలు సేవలందించేందుకు 2006లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే కొంతకాలం వైద్య సేవలు బాగా కొనసాగాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ సేవలు కుంటుపడ్డాయని చెప్పవచ్చు. దీనికి ప్రధాన కారణం రెగ్యులర్ వైస్ చాన్సలర్ ఉన్నప్పటికీ వైసీపీ నాయకులు ఆడిందే ఆట పాడిందే పాటగా చెల్లుబాటు అయింది. దీంతో యథారాజా తథా ప్రజా అన్న చందంగా అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆరోగ్య కేంద్రం నిర్వహణ, అవసరమైన మందుల సేకరణకు ప్రతి నెల యూనివర్సిటీ రూ.50వేలు మంజూరు చేస్తుంది. అయితే ఈ నిధుల వినియోగంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యూనివర్సిటీలో విద్యార్థులు, పరిశోధన స్కాలర్లు, ఉద్యోగులు అందరు కలిపి దాదాపు 3500 మంది వరకు ఉన్నారు. వీరిలో 2000 మంది వరకు విద్యార్థులు క్యాంపస్ హాస్టల్స్‌లో ఉంటున్నారు. వీరికి కనీసం జ్వరం, జలుబు, తలనొప్పి వంటి సీజనల్ వ్యాధులు వచ్చినా వాటికి మందులు లేక అవస్థలు పడుతున్నారు. ఇక యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉన్న మహిళల పరిస్థితి చాలా దయనీయమని చెప్పాలి. ఏ సమస్య వచ్చిన దాదాపు 15కిలోమీటర్లు ప్రయాణించి కడప టౌన్‌కు వచ్చి మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఆరోగ్య కేంద్రం మెయింటెనెన్స్‌కు ఏడాదికి రూ. 6 లక్షల బడ్జెట్‌ను యూనివర్సిటీ కేటాయిస్తుంది. అయితే ఈ బడ్జెట్ మొత్తం ఎటువైపు పోతుందో తెలియని పరిస్థితి.

కేంద్రంలో లభించాల్సిన సౌకర్యాలు

యూనివర్సిటీ ప్రారంభించినది మొదలుకొని గత టీడీపీ ప్రభుత్వ హయాం వరకు ఆరోగ్య కేంద్రం ఉపయోగకరంగా ఉండేది. ఆరోగ్య కేంద్రంలో ప్రధానంగా సీపీఆర్ ప్యాకెట్ మాస్క్, టోర్నీకెట్, రోలర్, గాజుగుడ్డ, ప్యాడ్లు, మెడికల్ ట్యాప్‌లు, త్రిభుజాకార బ్యాండేజీలు, సామ్ స్ప్రింట్, ఎలాస్టిక్ బ్యాండేజ్, టట్రా మాషియర్స్, యాంటి సెప్టి క్ సొల్యూషన్, యాంటీబయాటిక్ ఆయింట్‌మెంట్, హెచ్2 ఓ2, కాటన్, ఆల్కహాల్ ఆధారిత స్పిరిట్, సెలైన్ మొద లైన అన్ని వస్తువులు ఉండేవి. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవేవీ కూడా అందుబాటులో లేవనే చెప్పాలి. అలాగే కేంద్రంలో క్లినికల్ ల్యాబ్, ఈసీజీ, బయో-కెమికల్ ల్యాబ్ ఉన్నప్పటికీ నిరుపయోగమని చెప్పాలి.




తెరవకుండా ఉన్న ఫార్మసీ గది, మందులు లేని దృశ్యం

జ్వరం బిల్ల కావాలన్నా రిమ్స్‌కే..

విశ్వవిద్యాలయంలో అత్యవసర కేసులకు వైద్యం నిర్వహిం చేలా 2008 నుంచి రిమ్స్‌తో విశ్వవిద్యాలయం ఎంఓయూ చేసుకుంది. అయితే ప్రస్తుతం ఆరోగ్య కేంద్రంలో మందు లు లేకపోవడంతో చిన్న అనారోగ్య సమస్య తలెత్తినా, కనీసం జ్వరం మాత్ర కావాల్సి వచ్చినా యూనివర్సిటీ అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించి అక్కడ వైద్యం చేయించే పరిస్థితి నెలకొంది. ఆరోగ్య కేంద్రానికి బడ్జెట్ ఉన్నప్పటికి ఈ దుస్థితి ఎందుకు ఉన్నదో అధికారులే చెప్పాలి.



ఇ-టెండర్ల ద్వారా మెడిసిన్ కొనుగోలు చేయాలి

ఇ-టెండర్ల ద్వారా మెడిసిన్ కొనుగోలు చేయాలి. అయితే డాక్టర్ అందుబాటులో ఉండడం లేదు. ప్రస్తుతం బడ్జెట్ రూ.80వేలకు పెంచడం జరిగింది. మందులు కొను గోలు చేయాలంటే ఇ-టెండర్ పిలవాల్సిందే. మే, జూన్ నెలలో విద్యార్థులు క్యాంప స్‌లో లేని కారణంగా కొంత ఆలస్యం జరిగింది. ప్రస్తుతం టెండర్లు పిలిచేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. త్వరలో ఆరోగ్య కేంద్రంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి.

-ప్రొఫెసర్ పి.పద్మ, రిజిస్ట్రార్, వైవీయూ

మందుల కొనుగోళ్లలో కిరికిరి

ఆరోగ్య కేంద్రానికి కావాల్సిన మందులు కొనుగోలులో కూడా పెద్ద స్కాం జరిగినట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాంలో మెడిసిన్ కొనాలంటే పక్కనే ఉన్న రిమ్స్‌లో కొనుగోలు చేయకుండా పులివెందుల నియోజకవర్గం వేంపల్లె నుంచి కొనుగోలు చేయడంలో మతలబు ఏమిటో తెలియాల్సి ఉంది. దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తే అసలు నిజం బయటకు వచ్చే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దుర్మార్గం

- ఏపీయూడబ్ల్యూజే

కడప ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్ర జ్యోతి): చిత్తూరు ఆంధ్రజ్యోతి డిప్యూటీ చీఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ మూకలు దాడిచేయడం హేయమైన చర్య అని.. తక్షణమే దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ యూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు పల్లెటి రామసుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి ఎక్కంటి ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా గౌరవాధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు. బుధవారం బంగారుపాలెం జగన్ పర్యటనలో వైసీపీ మూకల దౌర్జన్యంపై వారు మండిపడ్డారు. యార్డులో జగన్ రైతులతో మాట్లాడే ఫొటోలు తీస్తున్న శివకుమార్‌పై సుమారు పది మంది చుటుముట్టి చొక్కా చించేసి విచక్షణారహితంగా కొట్టడం చూస్తే వైసీపీ నాయకులకు ప్రజాస్వామ్యంపై గౌరవం లేదని అర్థమవుతోందన్నారు. ఉదయం నుంచి తీసిన ప్రోగ్రాం ఫొటోలు ఉండే మెమొరీ కార్డు లాక్కున్నారని తెలిపారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి సైగ చేయంతో దాడి ప్రారంభమైందని... దీనికి బాధ్యులుగా అతనిపై కేసు నమోదు చేయాలన్నారు. చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి చూస్తుండగా దాడి జరగడం వైసీపీ నేతల ప్రోద్బలంతో జరి గిందనడానికి నిదర్శనమన్నారు. తక్షణమే దాడి చేయడానికి ప్రోత్సహించిన వారిని అరెస్టు చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

కె.బొమ్మేపల్లె డీకేటీ భూములపై విచారణ


రైతులను విచారిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

కొండాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.బొమ్మేపల్లె గ్రామానికి చెందిన డీకేటీ భూములపై ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ బుధవారం విచారణ చేపట్టారు. కె.బొమ్మేపల్లె డీకేటీ భూముల్లో భారీగా అవకతవకలు జరిగాయని సోమవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కలెక్టర్, జేసీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జేసీ ఆదేశాల మేరకు ఆర్డీవో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టి రికార్డులను పరిశీలించారు. ఈ భూములకు సంబంధించి చాలామంది అనర్హులుగా ఉన్నారని, తప్పుడు రికార్డులు సృష్టించి పరిహారం పొందాలని చూస్తున్నారని పలువురు రైతులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురప్ప, ఆర్ఐ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై ఆర్డీవో..

పోరుమామిళ్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మండలంలోని బాలిరెడ్డిపల్లె గ్రామంలో ఇటీవల అప్పుల బాధ తాళలేక బాలక్రిష్ణ అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. బాలాయపల్లె గ్రామాన్ని బుధవారం ఆర్డీవో చంద్రమోహన్ సందర్శించి రైతు ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాలక్రిష్ణకు ఎంత మేర పొలం సాగు చేశారు.. అప్పులు ఎన్ని ఉన్నాయి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగరాయకొండ - మైదుకూరు నాలుగు లైన్ల జాతీయ రహదారికి సంబంధించి రోడ్డు విస్తరణలో స్థలాలు, భూములు, ఇళ్లు కోల్పోతున్న వారి గురించి విచా రణ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి, సీఐ శ్రీనివాసులు, వ్యవసా యాధికారి చంద్రహాసరెడ్డి పాల్గొన్నారు.

దీర్ఘకాలిక పంటలు సాగు చేయాలి

పోరుమామిళ్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటలకు బదులు దీర్ఘకాలిక పంటలను సాగు చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గురప్పగారిపల్లెలో ఆయిల్‌పాం మెగా ప్లాంటేషన్‌పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం స్థానిక స్త్రీశక్తి భవన ఆవరణలో పామాయిల్ మొక్కలు నాటే కార్యక్రమం నియోజకవర్గ టీడీపీ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. అనంతరం రంగసముద్రం రైతు సేవా కేంద్రం లో ఉద్యానశాఖ రీఆగ్రో ఇండస్ట్రీస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆయిల్‌పాం సాగు, ప్రభుత్వ ప్రోత్సాహాలు వివరించిన గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్ పాం సాగు చేపట్టే రైతులకు రూ.29వేల విలువైన మొక్కలను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల ఉద్యానశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్ మహేశ్, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, మార్కెట్ యార్డుమాజీ చైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా క్రీడా పాఠశాల జిల్లాస్థాయి ఎంపికలు



విద్యార్థుల సర్టిఫికెట్స్ పరిశీలిస్తున్న సిబ్బంది, రన్నింగ్ చేస్తున్న విద్యార్థులు

కడప స్పోర్ట్స్, జులై 9 (ఆంధ్రజ్యోతి): వైయస్ఆర్ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి వెల్లడించారు. 4,5 తరగతులలో ప్రవేశానికి సంబంధించి తొలుత బుధవారం 4వ తరగతి ప్రవేశానికి గాను హాజరైన విద్యార్థినీ విద్యార్థులకు ఫిజికల్ టెస్ట్ నిర్వహించి, అందులో నలుగురిని అనర్హులుగా గుర్తించి తిరస్కరించామన్నారు. మరో 9 మంది సరైన సమయానికి హాజరు కాలేకపోయినట్లు వెల్లడించారు. వీరికి ఈనెల 11న మరో అవకాశం కల్పిస్తామని తెలిపారు. తొలిరోజు ఎంపికలలో పాల్గొన్న అర్హులైన 40 మందిలో 27 మందికి ఎత్తు, బరువు, మెడిసిన్, బాల్‌పుట్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, ఫ్లెక్సిబిలిటీ, 6ఇంటు10 షటిల్‌రన్, 30 మీటర్స్ ఫ్లైయింగ్ స్టార్ట్, 600 మీటర్స్ పరుగు పందెం తదితర టెస్ట్‌లు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యులు సాయి ప్రశాంత్, సతీష్‌కుమార్, స్పోర్ట్స్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నిర్లక్ష్యమే ఆర్కిటెక్చర్ విద్యార్థులకు శాపం


టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఆర్కిటెక్చర్ విద్యార్థులు

చెన్నూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆర్కిటెక్చర్ కాలేజీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు బుధవారం పొలిట్‌బ్యూరో సభ్యుడు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్వాకం వల్లనే కాలేజీకి సీవోఏ గుర్తింపు రాలేదన్నారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కళాశాల ఏర్పాటు చేసేటప్పుడే గుర్తింపు ఉండాలన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. పైగా ప్రైవేటు బిల్డింగులలో కాలేజీలు నడుపుతూ నెలకు లక్షల్లో అద్దెలు కడుతున్నారు.. దీనిపై ఇంత వరకు ఎందుకు దృష్టి పెట్టలేద న్నారు. విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేయడం బాధాకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కాగా, తమ సమస్యల పరి ష్కారానికి దీక్ష చేస్తున్న ఆర్కిటెక్చర్ విద్యార్థులకు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి సంఘీభావం తెలిపారు. విద్యార్థుల సమస్యలు తెలుసు కొని ఆయన యూనివర్సిటీ ఈసీ విశ్వనాథకుమార్‌తో చర్చించారు.

ఆధిక్యతలో కర్నూలు, కడప జట్లు

కడప స్పోర్ట్స్, జులై 9 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మల్టీడే క్రికెట్ వేర్వేరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లలో బుధవారం ప్రత్యర్థి జట్లపై కర్నూలు జట్టు 174 పరుగుల ఆధిక్యత సాధించగా, కడప జట్టు 319 పరుగుల ఆధిక్యత సాధించిచింది. వివరాలిలా..... కేఓఆర్ఎం మైదానంలో కర్నూలు- చిత్తూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో రెండోరోజు బుధవారం తిరిగి బ్యాటింగ్‌కు దిగి 63.4 ఓవర్లలో 251 పరుగులకు కుప్ప కూలింది. కాగా కర్నూలు జట్టు తన రెండవ ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసింది. ఇందులో మురారీ హృదయ్ 60 పరుగులు చేశారు. దీంతో కర్నూలు జట్టుకు 174 పరుగుల ఆదిక్యతలో నిలిచింది.


ఏసీఏ మైదానంలో కడప- అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో ఓవర్‌నైట్ స్కోర్ 461 పరుగులతో తిరిగి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 93.2 ఓవర్లలో 495 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో ఆర్థిత్‌రెడ్డి 100 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు 67 ఓవర్లలో 250 పరుగులకే చేతు లెత్తేసింది. ఇందులో వీరారెడ్డి 133 పరుగులు చేశారు. దీంతో కడప జట్టుకు 211 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 15 ఓవర్లలో 74 పరుగులు చేసింది.

మధ్యవర్తిత్వంపై అవగాహన పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి ప్రత్యూషకుమారి

కడప రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంపై అవగాహనను పెంపొందించుకొని తద్వారా కేసులను సులువుగా పరిష్కరించుకోవాలని డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో శిక్షణ పొందిన మధ్యవర్తుల(న్యాయవాదులు)కు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మధ్యవర్తిత్వ ప్రతిష్టంభనలు, రాజీ ఒప్పందాలను అధిగమించడం, ఆధునిక మధ్యవర్తిత్వ సవాళ్లను నావిగేట్ చేయడం, కేస్ స్టడీస్, గ్రూప్ యాక్టివిటీ, బహుళ పార్టీ సాంస్కృతిక ఒప్పంద వ్యూహాలు తదితర అంశాలను తెలియపరిచారు. కార్యక్రమంలో న్యూఢిల్లీకి చెందిన అడ్వకేట్, సీనియర్ ట్రైనర్ అనూష సక్సేనా, మధ్యప్రదేశ్‌కు చెందిన అడ్వకే ట్, సీనియర్ ట్రైనర్ మీనా కేర్, న్యాయవాదులు పాల్గొన్నారు.



36 బ్యాటరీలు చోరీ

మదనపల్లె అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం టిప్పుసుల్తాన్ మైదానంలో నిలిపిన లారీలు, ట్రాక్టర్లు, ఐషర్లు, టిప్పర్ల నుంచి మంగళవారం రాత్రి 36 బ్యాటరీలు చోరీ చేశారు. బుధవారం ఉదయం యాజమానులు గంగాధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మధుకర్‌రెడ్డి, అశోక్‌కుమార్ టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు విచారణ చేపట్టారు. రాత్రి కావడం ఎవరూ లేకపోవడంతో గమనించిన దుండగులు ఈ చోరీకి పాల్పడారన్నారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సబ్‌జైలు తనిఖీ

మదనపల్లె అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైల్‌ను బుధవారం రాష్ట్ర జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ అంజనీ కుమార్ తనిఖీ చేశారు. జైళ్ల పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. జైళ్లలో నిందితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో జైలర్లు బాధ్యతగా, భద్రత కల్పించాలన్నారు.

గోడౌన్‌లో సరుకు బయటకు పోనివ్వం

- గేటుకు తాళం వేసి లారీలను అడ్డుకున్న రైతులు
- భూపేశ్‌రెడ్డి హామీతో పొగాకు పంట తరలింపు
- మా పరిస్థితి ఏంటి అంటున్న మరికొందరు రైతులు



జీపీఐ కంపెనీ సరకు లారీలు బయటకు వెళ్లకుండా అడ్డుకున్న రైతులు, గోడౌన్‌లోపల నిలిచి వున్న లోడు లారీలు

ముద్దనూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు లోని యశ్వంత్ గోడౌన్ వద్ద మూడు రోజులుగా పెద్దముడియం మండలం సుంకేసుల, ముద్దనూరు మండలం పెద్దదుద్యాల, జమ్మలమడుగు రైతులు జీపీఐ కంపెనీ వారు పొగాకును కొనుగోలు చేయాలని ఆందోళన చేస్తున్నారు. అయితే జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అళ్లగడ్డ సమీపంలోని జీపీఐ కంపెనీ వారి గోడౌన్‌లోపొగాకు పంట విక్రయిస్తారని తెలపడంతో పెద్దముడియం మండలం రైతులు బుధవారం పంటను తరలించారు. అయితే మా పరిస్థితి ఏమిటనిముద్దనూరు, జమ్మలమడుగు రైతులు ఆందోళనచెందుతున్నారు. రైతుల సమాచారం మేరకు.. జీపీఐ కంపెనీ వారు రైతులను పొగాకు పంట సాగు కోసం నారు ఇచ్చి, పంట కొనుగోలు చేస్తామని ప్రోత్సహించారు. ముద్దనూరులోని యశ్వంత్ గోడౌన్‌లో ఆ కంపెనీ వారు పొగాకు విక్రయం చేపట్టారు.ఇదే క్రమంలో పెద్దముడియం, ముద్దనూరు, జమ్మలమడుగు రైతులు పొగాకు గోడౌన్ వద్దకు తేగా కంపెనీ వారు విక్రయం లేదన్నారు. దీంతో రైతులు ఆగ్రహించి ఆందోళన చేపట్టారు. రాత్రింబవళ్లు రైతులు గోడౌన్ వద్దనే కాపలా ఉండి గోడౌన్‌లోని సరుకు తరలించకుండా లారీలను అడ్డుకున్నారు. పంటను కొనుగోలు చేసేంత వరకు వెళ్లేది లేదన్నారు. పంట తీసుకొచ్చిన ట్రాక్టర్లను గోడౌన్ వద్ద ఉంచారు. దీంతో పంట కొనుగోలు చేస్తామని కంపెనీ వారు తెలియజేశారని భూపేష్ రెడ్డి తెలపడంతో పంటను అళ్లగడ్డకు తరలించారు. అయితే ముద్దనూరు, జమ్మలమడుగు రైతులు మా పరిస్థితి ఏమిటని,స్థానికంగా ఉన్న గోడౌన్‌లోనే తమ పంటను విక్రయించాలని రైతు అశోక్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

సమాన వేతనం ఇవ్వాలి

వేంపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆర్జీయూకేటీలో 2018లో జాయిన్ అయిన అధ్యాపకులు కోరారు. బుధవారం ఇడుపులపాయ డైరెక్టర్ కుమారస్వామి గుప్తను కలిసివినతిపత్రం ఇచ్చారు. ఏడేళ్లుగా పనిచేస్తున్న తమకు అన్యాయం జరుగుతోందని, ఇప్పటికైనా వేతనం పెంచి డిజిగ్నేషన్ మార్చాలని కోరారు.


ప్రకృతి వ్యవసాయం మేలు

చక్రాయపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరమని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని కల్లూరుపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు తదితరులుపాల్గొన్నారు.

హామీలను నెరవేర్చడం బాబుకే సాధ్యం

వేంపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): హామీలను నెరవేర్చడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలోని ఇమాంనగర్‌లో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డి, మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, జిల్లా గ్రంథాలయ మాజీచైర్మన్ బాలస్వామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, ఎద్దుల శేషారెడ్డి, నాయకులు మహబూబ్ షరీఫ్, తక్కెళ్ల షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె..: సుపరిపాలనలో అంతా సంతోషాలే అని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గోనుమాకులపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబుపాలనలో సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. పథకాలు రాని వారికి అక్కడే అధికారులను పిలిచి పరిష్కారం చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపల్లె ఇమామ్‌నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరెడ్డి, వీరపునాయునిపల్లెలో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

సర్వరాయసాగర్ ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. మండల టీడీపీ కన్వీనర్ భైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం గోనుమాకులపల్లె గ్రామంలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్,ఏఓ,ఎంఈఓ, టీడీపీ,బీజేపీ, నాయకులు శేఖర్‌రెడ్డి, గుర్రప్ప,ఆంజనేయులు, గోపాలయాదవ్, రమణారెడ్డి, ఓబయ్యయాదవ్, గోపీనాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, తులసినాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడప మారుతీనగర్..: చంద్రబాబు సారధ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు మహర్దశ అని నగర 49వ డివిజన్ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జ్ రాజా, సహాయ ఇన్‌చార్జ్ కె. చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి, వెల్లడించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లె ఎస్సీ కాలనీలో ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించి సూపర్‌సిక్స్ పథకాల అమలు కరపత్రాలను పంపిణీచేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్ రెడ్డి, జానకిరామ్, నిత్యపూజయ్య, వెంకటరమణ, వినోద్, జనార్దన్ పాల్గొన్నారు.

కడప ఎర్రముక్కపల్లె..: టీడీపీతోనేసుపరిపాలన సాధ్యమవుతుందని టీడీపీ కడప నగర అధ్యక్షుడు శివకొండా రెడ్డి తెలిపారు. బుధవారం కడపనగరం 28వ డివిజన్‌లో ఇంటింటా టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు నక్కల శివరాం, రవిశంకర్‌రెడ్డి, రాష్ట్ర వాణిజ్య సెల్ ప్రధాన కార్యదర్శి, నాయీబ్రాహ్మణ మాజీ డైరెక్టర్ ద్వారక ప్రేమ కుమార్, 28వ డివిజన్ ప్రధాన కార్యదర్శి అల్లాబకాష్ పాల్గొన్నారు.

వేముల..: మండలంలోని రాచకుంటపల్లె గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పేర్ల శేషారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




ఆలంఖాన్‌పల్లెలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, కడపలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న శివకొండారెడ్డి

'విద్యాహక్కు చట్టాన్ని గాలికొదిలేసిన కూటమి సర్కార్'

కడప మారుతీనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టాన్ని రాష్ట్రంలో కూటమి సర్కార్ పూర్తిగా గాలికొదిలేసిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు ధ్వజమెత్తారు.విద్యాహక్కు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరాహారదీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రామరాజు, నాయకులు వీరభాస్కర్, వెంకటస్వామి, రామలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్ స్పెషల్ డ్రైవ్

కడప క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలు,విద్యాసంస్థల వద్ద100 మీటర్ల దూరంలో సిగరెట్,పొగాకు సంబంధిత ఉత్పత్తులు విక్రయించడం నిషేధించారు. ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించాలని ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రెండో రోజు బుధవారం పోలీసు అధికారులు తమ పరిధుల్లోని ఆయా విద్యాసంస్థలను సందర్శించి 100 మీటర్ల లోపు టీషాపులు, పాన్‌షాపులు, కిరాణం షాపుల్లో సిగరెట్లు, ఖైనీ, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు అమ్మడం నిషేధమని షాపు నిర్వాహకులకు తెలిపారు. విద్యాసంస్థల వద్ద పొగాకు ఉత్పత్తులను విక్రయించే షాపుల యాజమానులకు జరిమానాలువిధించారు.

కార్మికులంతా ఐక్యంగా పోరాడాలి

ట్రిపుల్‌ఐటీ వద్ద నిరసన

వేంపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరా డాల్సిన అవసరం ఉందని కార్మిక నేతలు పిలుపు నిచ్చారు.పది గంటల పని విధానాన్ని వెనక్కి తీసు కోవాల ని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం ఇడుపుల పాయ ట్రిపుల్‌ఐటీలో ఉద్యో గులు, సెక్యూరిటీ టీగార్డులు నిరసన తెలిపారు. వేంపల్లె నాలుగురోడ్ల కూడలిలో భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బల్లారపు ఆంజనేయులు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు యూనియన్ల నేతలు పాల్గొన్నారు.

ఎస్సీ నిరుద్యోగ యువతి, యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి

పులివెందుల రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ నిరుద్యోగ యువతీ యువకులకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) పులివెందుల, జమ్మలమడుగులలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రాకేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పులివెందులలోని న్యాక్‌లో డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్, జమ్మలమడుగులో బ్రాడ్ బ్యాండ్ టెక్నీషియన్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామన్నారు.18 నుంచి 40ఏళ్ల వరకు ఉన్న వారు అర్హులన్నారు. సుమారు రెండు నెలల పాటు జరిగే ఈ శిక్షణలో మధ్యాహ్నం భోజనం కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు జూలై 19లోపు పులివెందుల, జమ్మలమడుగుల్లోని న్యాక్‌కేంద్రాలను సంప్రదించాలని కోరారు.

పంటల బీమా ప్రీమియం 31లోపు చెల్లించాలి

కమలాపురం రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంటలబీమాకు ఈ నెల 31 వరకు బీమా సొమ్ము చెల్లించవచ్చని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. బుధ వారం స్థానిక ఏడీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్‌బీమాయోజన వాతావరణ ఆధారిత బీమాలో పత్తికి రూ.2వేలు, వేరుశెనగ 560, బత్తాయి 2,750, అరటికి 3,065, ఎకరాకు మొత్తం జూలై 15 వరకు గడువు ఉందన్నారు. వరికి 84, కంది 36, జొన్న 38, మినుము 38, పసుపు 180, ఉల్లికి 90 చొప్పున జూలై 31 వరకు చెల్లించవచ్చన్నారు. వరికి మాత్రం ఆగస్టు 15 వరకు చెల్లించేందుకు అవకాశం ఉందని రైతులు తెలిపారు. ఈ పంట నమోదు చేయించుకోవాలని అన్నారు.

విద్యుత్ భవన్ వద్ద ధర్నా

కడప నాగరాజుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మహాధర్నా బుధవారం విద్యుత్ భవన్ వద్ద నిర్వహించారు. రాష్ట్రప్రధానకార్యదర్శి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ 40 కార్మికచట్టాలను నాలుగుచట్టాలుగా కేంద్రపభుత్వం మార్చడం దారుణమన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా మొహర్రం

పులివెందుల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో వైభవంగా సాగుతున్న మొహర్రం వేడుకలకు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో జెండామాను వీధిలో ఏర్పాటుచేసిన మస్తాన్ వలి పీర్లను ఆయన దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మైసూరారెడ్డి, గంగిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, షేక్ గౌస్‌బాష, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రొట్టెల పండుగ

కడప మారుతీనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మొహర్రం పర్వదినం సందర్భంగా36వ డివిజన్ బళ్ళారి రోడ్డు విశ్వభారతి స్కూల్ సమీప సయ్యద్‌షేక్షావలి ఖాదిరిచిస్తి సయ్యద్ షాషావలి ఖాదిరి చిష్టి మసీద్‌లో బుధవారం రాత్రి రొట్టెల పండుగను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాధవి హాజరై రొట్టెలను వదిలారు. ఆ డివిజన్ ఇన్‌చార్జ్ ఫారుక్, లయన్ పటాన్ మన్సూర్ అలీఖాన్, ఖాదర్‌బాష, సుబ్బరాయుడు, బాలకృష్ణ, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రంగంలో యువతకు విస్తృత అవకాశాలు

కడప ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగంలో ప్రభుత్వ ఉద్యోగంతో కెరీర్‌ను ప్రారంభించాలనుకునే యువతకు పీఓ పోస్టులు అద్భుత అవకాశాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కల్పిస్తోందని రీజనల్ మేనేజర్ నూతన్‌కుమార్ అన్నారు. బుధవారం వైవీయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ శాఖ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత, వైవీయూ ఎస్‌బీఐ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంబీఏ విద్యార్థులకు పీఓ ఉద్యోగ నియామకాలపై అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు.

'ఉపవిద్యాశాఖ అధికారి అవినీతిపై విచారణ జరపాలి'

కడపనాగరాజుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కడప ఉపవిద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి అవినీతిపై విచారణ జరపాలని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా కడప కలెక్టర్ కార్యాలయంలో ఏఓ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, అఖిల్ పాల్గొన్నారు.

ప్రజలకు అండగా టీడీపీ

కడప నాగరాజుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అండగా టీడీపీ ప్రభుత్వం ఉంటుందని టీడీపీ సీనియర్ మైనార్టీ నాయకుడు షేక్ అమానుల్లా తెలిపారు. బుధవారం పట్టణంలోని గౌస్‌నగర్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు



వేంపల్లె నారాయణ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో తులసిరెడ్డి తదితరులు

వేంపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు అని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. వేంపల్లెలోని నారాయణ హైస్కూల్లో బుధవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కరస్పాండెంట్ నారాయణరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డి, ఎంఈవో స్టాలిన్, ఉపాధ్యాయులు, టీడీపీనేతలు షబ్బీర్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన : ఎమ్మెల్యే మాధవి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎర్రముక్కపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన చంద్రబాబుకే సాధ్యమని కడప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ మాధవి తెలిపారు. బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కడప ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కడప నగరం 19వ డివిజన్ సరస్వతి శిశు మందిర్ స్కూల్ ప్రాంతంలో నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తైన సందర్భంగా ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి, టీడీపీ నాయకులు,కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్ బూత్ ఇన్‌చార్జిలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

చక్రాయపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులుగా తమను గుర్తించాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. బుధవారం చక్రాయపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు, వీఆర్‌ఏలు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసీడీఎస్ బడ్జెట్ పెంచాలని, కనీసం వేతనం రూ.26వేలు పెంచాలని, గ్రాట్యుటీ జీఓ నెంబర్ మార్పు చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా మార్చాలన్నారు. రైల్వే,విద్యుత్ స్టీల్ బ్యాంక్ ఇన్సూరెన్స తదితర ప్రభుత్వ రంగాలలో ప్రైవేటీకరణ విధానాలను ఆపలాన్నారు. అనంతరం తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం సమర్పించారు.

చెన్నూరు..: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మండలంలోని అంగన్వాడీలు, ఆయాలు ధర్నానిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకురాలు, అధ్యక్షురాలు పద్మావతి మాట్లాడుతూ,అంగన్వాడీ నాయకురాళ్లు రాధామాధవి, ఇందిరమ్మ, సుమలత, సలోమి, చిన్నమ్మ, వెంకటసుబ్బమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

సీకెదిన్నె..: అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనం ఇవ్వాలని అంగన్వాడీ టీచర్లు తదితరులు, వివిధ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. మండల కేంద్రమైన చింత కొమ్మదిన్నె మండలంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మండలంలోని వారంతా సమ్మె చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

లేబర్ నల్లచట్టాలను రద్దు చేయాలి

కమలాపురం రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): లేబర్ నల్లచట్టాలను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటివేణుగోపాల్ అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం కమలాపురం ఐసీడీఎస్ ఆఫీసు నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష కార్యదర్శులు రాణి, చంద్రశేఖర్, ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సుభాషిణి, జిల్లా అధ్యక్షుడు మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.




చక్రాయపేట, సీకే దిన్నెలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు తదితరులు





కార్మికులకు ద్రోహం చేస్తున్న కేంద్రం

● లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ● కార్మిక, ప్రజా సంఘాల ర్యాలీలు.. నిరసనలు ● సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్



ప్రొద్దుటూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు


జమ్మలమడుగులో సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల కార్మికులు ర్యాలీ



బద్వేలులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘ నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి తెచ్చుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి కార్మికులకు ద్రోహం చేస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ విమర్శించారు. బుధవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో విజయకుమార్ సర్కిల్ నుండి శివాలయం సెంటర్ వరకు, అలాగే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుండి మార్కెట్‌యార్డు వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోర్టులుగా మార్చిందని, ఈ చట్టాల వలన కార్మికులకు భద్రత లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కార్మికులకు జీతాలు ఇవ్వకుండా పనిచేసిన రోజుకు కూలీ చెల్లించే పరిస్థితి వస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షుడు చంటి, గురుమూర్తి, శ్రీను, సుబ్బారావు, సునీత, పద్మ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య, కాంగ్రెస్ పార్టీ నజీర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పతనం తప్పదు

జమ్మలమడుగు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పట్టించుకోకపోతే ప్రభుత్వ పతనం తప్పదని ఏఐటీయూసీ, సీఐటీయూ, డీవైఎఫ్ఐ తదితర సంఘాల నేతలు హెచ్చరించారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం నుంచి కార్మికులు, సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించి పాత బస్టాండు గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయం వద్ద వేరువేరుగా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రసాద్, రాంప్రసాద్, డీవైఎఫ్ఐ నాయకుడు సుబహాన్, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

కొండాపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కార్మిక సంఘాలు, అంగన్వాడీ, ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నల్లచట్టాలను రద్దు చేయాలని కోరారు. ముందుగా స్థానిక స్టేట్‌బ్యాంక్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు మనోహర్‌బాబు, వెంకటరమణ, సుబ్బారావు, అంగన్వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నల్ల చట్టాలను రద్దు చేయాలి

ఎర్రగుంట్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు నల్ల చట్టాలను రద్దు చేసేవరకు పోరాటం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మంజుల డిమాండ్ చేశారు. బుధవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథక కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు. ఆర్టీపీపీలో విద్యుత్ కార్మికులు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గంగాసురేష్, శరత్, పార్వతి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మిక సంఘాలు

బద్వేలు, జూలై 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఎన్‌జీవో కాలనీ నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాగేంద్రబాబు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి యజమానులకు బానిసలుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పనిగంటలు పెంచే నిర్ణయాన్ని ఉపసంహరించుకుని 8 గంటల పనివిధానాన్ని కొనసాగించాలని, ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణను మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు శ్యామ్ ప్రవీణ్, ఓబులేసు, సుభాషిణి, సత్యవతి, చిన్ని, షరీఫ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో..

బ్రహ్మంగారిమఠం, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను హరించే నాలుగులేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ తెలిపారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బి.మఠం జడ్పీ బాలుర హైస్కూలు నుండి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అనంతరం వీఆర్వోకు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నాడన్నారు. కార్యక్రమం లో సీపీఎం మండల కమిటీ సభ్యులు హరి, సుబ్బమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, మండల ఉపాధ్యక్షుడు అరవింద్ పాల్గొన్నారు.

మైదుకూరులో..

మైదుకూరు రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో అంగన్‌వాడీల ధర్నాను విజయవంతంగా నిర్వహించారు. స్థానిక పెద్దమ్మ గుడి వద్ద నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

మైదుకూరులో అంగన్వాడీ వర్కర్ల నిరసన


చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి

● 'సుపరిపాలనలో తొలి అడుగు'లో టీడీపీ నేతలు

జమ్మలమడుగు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని 15వ వార్డు బురుజు వీధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐఎల్ చిన్న, జంబాపురం రమణారెడ్డి, దాదాపీర్, పోలీస్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమం

ప్రొద్దుటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి సంక్షేమం అందజేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి అన్నారు. బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో స్థానిక 29వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన మండలంలో..

కాశినాయన, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డమాను గ్రామంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు గురివిరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, గొంటువారిపల్లెలో టీడీపీ నాయకుడు కొండా రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాడుల్లా, పెద్దో పీరయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరా వేళల మార్పు

మైదుకూరు రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలుగుగంగా సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11కేవీ వ్యవసాయ ఫీడర్‌లలో 3ఫేసుల విద్యుత్ రైతులకు ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు రాత్రి 2గంటల నుంచి ఉదయం 9గంటల వరకు మాత్రమే విద్యుత్ సరఫరా ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారి వీరభద్రయ్య తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకం : ఏడీఏ

ఎర్రగుంట్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో లాభదాయకమని ఏడీఏ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పోట్లదుర్తి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పీడీఎస్ పద్ధతి ద్వారా పంటలు సాగు చేయడం వలన ఎరువుల వినియోగం తగ్గుతుందని, లాభసాటిగా కూడా ఉంటుందన్నారు. కార్యక్ర మంలో డీపీఎం ప్రవీణ్, ఏవో సుజనకు మారి, ఎంపీటీసీ పి.శివప్రతాప్‌రెడ్డి, సర్పంచి నరసింహులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి

ముద్దనూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహించబోవు సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జమ్మలమడుగు నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ వరకు బద్వేల్ జిల్లా మహాసభలు జరుగుతాయని, ప్రజలు హాజరై విజయంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

బ్రాహ్మణపల్లె సింగిల్‌విండో చైర్మన్‌గా

రామానాయుడు



గోపవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపల్లె సింగిల్‌విండో చైర్మన్‌గా రామానాయుడు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈయన ఎంపిక పట్ల టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌రెడ్డి, కాంట్రాక్టర్ ప్రసాద్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ సభ్యులుగా అన్నపూర్ణమ్మ, రామయ్య నియామకం జరిగినట్లు తెలిపారు.

ప్రజల నమ్మకానికి నిదర్శనం 'సుపరిపాలన'

బద్వేలుటౌన్, జులై 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల నమ్మకానికి నిదర్శనం సుపరిపాలన అని నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి, పరిశీలకుడు తుగ్గిలి నాగేంద్ర, డీసీసీబి చైర్మన్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 7, 8 వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇవ్వడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, సింగసాని విజయ్‌కుమార్, షరీఫ్, సునీల్‌కుమార్, ఝాన్సీ పాల్గొన్నారు.

మేలైన వరి వంగడాలను సాగు చేయాలి

చాపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులు మేలైన వరి వంగడాలను సాగు చేయాలని ఏడీఏ కృష్ణమూర్తి, ఏవో మేరీ పద్మలత కోరారు. బుధవారం మొరాయిపల్లె, సోమాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి రైతులకు వరి పైరు సాగు చేసేందుకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైనవారు ఆయా గ్రామ సచివాలయాల్లో ధృవీకరణ పత్రాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు మాధవి, పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

పంటల బీమా చేసుకోండి

దువ్వూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల బీమా తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని చిన్నసింగనపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లి, వరి, పసుపు, మినుము, జొన్న, కంది పంటలకు బీమా చేసుకోవాలని తెలిపారు.

రేషన్ కార్డులో మార్పులు చేసుకోవచ్చు

బద్వేలు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులో సభ్యుల పుట్టిన తేదీ, జండర్, బంధుత్వం తప్పుగా ఉన్నట్లయితే వాటిని మార్చుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు

పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలి

అట్లూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని, ప్రతి ఉపాధ్యాయుడు సహకరించాలని అదనపు ప్రాజెక్టు అధికారి నిత్యానందరాజు తెలిపారు. బుధవారం మండలంలోని అట్లూరు ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈమీటింగ్‌క ప్రతి విద్యార్థి తప్పనిసరిగా హాజరై, ప్రభుత్వం అందించిన దుస్తులను ధరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు సీఎం విశ్వనాధరెడ్డి, ఎంఈవో-2 ఖాదర్‌వల్లి, అట్లూరు ఉన్నత ప్రధాన ఉపాధ్యాయులు కేజీబీవీ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.